


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 24-07-2022 సంపుటి : 03 సంచిక : 296 పేజీలు : 4 వెల : రూ 3-00


# ఏపీలో పారిశుద్ధ్య కార్మికులకు గుడ్‌న్యూస్..

## హెల్త్ అలవెన్స్‌కు గ్రీన్‌సిగ్నల్



అమరావతి: పారిశుద్ధ్య కార్మికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపి కబురు అందించింది. వీరికి ఆక్యుపెన్సీ హెల్త్ అలవెన్స్ ఉత్తర్వులు జారీ చేసింది. నెలకు రూ.6 వేలు ఈ అలవెన్స్ కింద అదనంగా చెల్లించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీఓ నంబర్ 233 ని ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుతం వీరికి మూలవేతనంగా రూ.15 వేలు అందుతున్నది. ఈ పెంపుదలతో వీరి జీతం రూ.21 వేలకు పెరిగింది. తాజా ఉత్తర్వులతో దాదాపు 43 వేల మందికి పైగా కార్మికులు లబ్ధి పొందనున్నారు.జీతాల పెంపుదలకు మున్సిపల్, కార్పొరేషన్లలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు ఇటీవల సమ్మెకు దిగారు. డిమాండ్లలో ముఖ్యమైన ఆరోగ్య భృతిని వీరు ప్రస్తావించారు. కార్మికులతో మంత్రుల కమిటీ చర్చలు జరిపింది. వారి డిమాండ్లకు ఓకే చెప్పడంతో కార్మికులు సమ్మె విరమించారు. సీఎం జగన్ వారి సమస్యలపై స్పందించి.. సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో మరో మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఈ విషయంపై అధికారులతో చర్చించి తగు విధంగా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నదని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. హెల్త్ అలవెన్స్ ఇచ్చేందుకు ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల వారు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఎల్లుండి కోనసీమ జిల్లాలో జగన్ పర్యటన



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 25న కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించనున్నారు. అన్నంపల్లి ప్రాజెక్టును కూడా సందర్శించి అక్కడి నష్టాన్ని తెలుసుకుంటారు. కాగా, అనకాపల్లి జిల్లాలో డిప్యూటీ మంత్రి ముత్యాల నాయుడు పర్యటించారు. తెనుగుపూడి గ్రామాన్ని సందర్శించి స్థానికులతో సమస్యలను అడిగి తెల్సుకున్నారు.వరద కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న కోనసీమ జిల్లాలో సీఎం జగన్ సోమవారం పర్యటించనున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించనున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకోనున్నారు. ఈ జిల్లాలో వరద నష్టాన్ని అంచనా వేసి తయారుచేసే నివేదికను సీఎం జగన్ కేంద్ర ప్రభుత్వానికి అందజేసి సాయం కోరనున్నారు. సీఎం జగన్ రాక సందర్భంగా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పీ గన్నవరంలోని హెలిప్యాడ్‌ను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో దెబ్బతిన్న పంటలను సీఎం జగన్ సందర్శించిన తర్వాత అక్కడి నుంచి అన్నంపల్లి అక్విడెక్ట్ ప్రాజెక్టుకు చేరుకుంటారు. వరదలకు ఈ ప్రాజెక్టుకు జరిగిన నష్టాన్ని తెలుసుకుంటారని అధికారులు తెలిపారు.అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం తెనుగుపూడి గ్రామాన్ని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సందర్శించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే అని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మమేకమై గ్రామంలోని ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏదైనా కారణాల వల్ల అర్హులైన వారు పథకాలను పొందడంలో విఫలమైతే, తిరిగి దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ సిబ్బందిని మరోసారి విచారించి అర్హులకు పథకాలు అందేలా చూస్తామని చెప్పారు. ఆయన పర్యటనలో భాగంగా తెనుగుపూడి గ్రామ శివారులో రూ.47 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు బీ బాబూరావు, మండల పరిషత్ అధ్యక్షులు కే భాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యులు కే సత్యనారాయణతోపాటు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జన్మలో నువ్ మారవు బాబూ! చంద్రబాబుపై విజయసాయి ట్వీట్

అమరావతి: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేరెత్తితేనే చిరాకు ప్రదర్శించే వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి.. వరుసగా ఆయనపై ట్వీట్లు విసురుతూ విమర్శిస్తున్నారు. ట్విట్టర్‌లో యాక్టీవ్‌గా ఉండే విజయసాయిరెడ్డి.. చంద్రబాబును లక్ష్యంగా చేసుకుని ట్వీట్లు చేస్తుంటారు. ఇదే వరసలో శనివారం చంద్రబాబుపై మరో ట్వీట్ పేల్చారు. జన్మలో నువ్ మారవు బాబూ..! అంటూ తన ఆగ్రహాన్ని వెళ్లగక్కారు విజయసాయిరెడ్డి.పశ్చిమ గోదావరి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు గత రెండు రోజులుగా పర్యటిస్తున్నారు. ఈ పర్యటనను విమర్శిస్తూ విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు. చౌకబారు డ్రామాలు మీ పేటెంట్ చంద్రబాబూ? మీతో అగ్రనటులు కూడా పోటీ చేయలేరని రాశారు. వరద నీటిని బాటిళ్లలో నింపి వాటినే జనం తాగుతున్నారని నమ్మించాలని చూశారంటూ సెటైర్ వేశారు. అయితే దానిని చూసిన వరద బాధితులే నవ్వుకుంటున్నారని, మీరు జన్మలో మారరని విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు.రెండు రోజుల క్రితం చంద్రబాబు తన పర్యటనలో బురద నీటి బాటిల్‌ను చూపుతూ వీటినే ప్రజలకు సరఫరా చేస్తున్నారని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే, తనకు స్థానిక టీడీపీ నేతలే ఆ బాటిల్ ఇచ్చి చంద్రబాబుకు ఇవ్వమన్నారని ఒక వృద్ధురాలు వెల్లడించింది. దాంతో ఆ విషయాన్ని వైసీపీ నేతలు టీడీపీ నేతల బండారాన్ని బయట పెట్టారు. దీనిపై విజయసాయిరెడ్డి తనదైన శైలిలో ట్వీట్ చేశారు.



# నంద్యాల మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి హైకోర్టు అనుమతి

అమరావతి: నంద్యాలలో వైద్య కళాశాల భవన నిర్మాణం చేపట్టేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య కళాశాల ఏర్పాటు నిమిత్తం నంద్యాలలోని వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చెందిన 50 ఎకరాల భూమిని ప్రభుత్వానికి బదలాయించడాన్ని సవాల్ చేస్తూ కర్నూలుకు చెందిన రైతులు బొజ్జా దశరథరామిరెడ్డి, మరో నలుగురు హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై మరిన్ని వ్యాజ్యాలు కూడా దాఖలయ్యాయి. వీటిపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన సీజే ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ధర్మాసనం గత విచారణ సమయంలో ఇచ్చిన ఆదేశాల మేరకు




నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రంలోనే వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంటూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కు దరఖాస్తు సమర్పించామన్నారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ నాటికి భవన నిర్మాణం చేపట్టకపోతే వైద్య కళాశాల అనుమతులు రద్దవుతాయన్నారు. అంతేకాక అమూల్యమైన విద్యా సంవత్సరం వృథా అవుతుందని వివరించారు. ఇందుకు సంబంధించి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పంపిన వివరాలను ఆయన ధర్మాసనం ముందుంచారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం అదనపు ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకుంది. వైద్య కళాశాల భవన నిర్మాణానికి అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ నిర్మాణం ఈ వ్యాజ్యాల్లో తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేసింది.

# చంద్రబాబు పర్యటన ప్రచారానికే : ఏపీ మంత్రి రాంబాబు

అమరావతి: ఈసారి గతంలో కంటే వరదలు ముందే వచ్చాయని దీంతో రాష్ట్రంలోని జలాశయాలు కళకళలాడుతున్నాయని ఏపీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. శ్రీశైలం డ్యాం పూర్తిగా నిండిందని తెలిపారు. దీంతో డ్యాం గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేశామని తెలిపారు. వరద బాధితులను పరామర్శించడానికి బాబు టీడీపీ జెండాలతో వెళ్తారా అని ప్రశ్నించారు.వరద రాజకీయం చేయాలనే ఉద్దేశంతో ఆయన గోదావరి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారని ఆరోపించారు. పరామర్శకంటే ప్రచారం కోసమే పర్యటిస్తున్నారని విమర్శించారు. పార్టీ జెండాలతో కలిసి పరామర్శించ డానికి వెళ్లే దౌర్భాగ్య పరిస్థితి వారికి ఏర్పడిందని అన్నారు. టీడీపీ నాయకులు సేవా దృక్పదంతో వరద ప్రాంతాల్లో పర్యటించడం లేదని ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై బురద చల్లడానికే వెళ్తున్నారని ఆరోపించారు.పోలవరం డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడం టీడీపీ ప్రభుత్వం చేసిన చారిత్రాతిక తప్పిదమని అన్నారు. కాఫర్ డ్యామ్ పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్ ఎవరైనా నిర్మిస్తారా అని మరోసారి ప్రశ్నించారు.



# భారత్‌లో కొత్తగా 21,411 కరోనా కేసులు

న్యూఢిల్లీ: భారత్ లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 21,411 తాజా కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో 20,726 డిశ్చార్జ్ కాగా, 67 మందిని కరోనా మహమ్మారి కబలించింది. దేశవ్యాప్తంగా 1,50,100 యాక్టివ్ కేసులు ఉన్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ తాజాగా విడుదల చేసిన హెల్త్ బులిటెన్ పేర్కొంది. రోజువారీ సానుకూలత రేటు 4.46 శాతంగా నమోదైందని తెలిపింది.



# కాలినడకన దుర్గమ్మను దర్శించుకున్న దేవినేని

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు దర్శించుకున్నారు. శనివారం ఉదయం కాలినడకన వచ్చి దుర్గమ్మ సేవలో తరించారు. దర్శనానంతరం టీడీపీ నేతమీడియాతో మాట్లాడుతూ.. ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందని.. పడవ ప్రమాదంలో గోదారమ్మ తల్లి పునర్జన్మ ఇచ్చిందని తెలిపారు. అందరి దేవుళ్ళ ఆశీస్సులు, శ్రీ కనకదుర్గమ్మ, గోదావరి తల్లి ఆశీర్వాదంతో మళ్లీ ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగిందని దేవినేని ఉమా చెప్పుకొచ్చారు.



# భారీ వర్షాలు.. ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేసిన సీఎం కేసీఆర్



హైదరాబాద్ : మరో మూడు, నాలుగు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఎగువ నుంచి గోదావరిలోకి భారీ వరద వచ్చే అవకాశం ఉంది. దీంతో గోదావరి పరివాహక జిల్లాలకు చెందిన మంత్రులను, ఎమ్మెల్యేలను అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండాలని సీఎం చెప్పారు.రాబోయే 3 రోజుల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఈశాన్య, ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాగల 4 వారాల పాటు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాగల 3 రోజులు అతి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# సంపాదకీయం

ఆదివారం 24-07-2022

## జమిలి ఎన్నికలకు పచ్చజెండా..?

జమిలి ఎన్నికలకు మోదీ ప్రభుత్వం పచ్చజెండాజమిలి ఎన్నికలకు మోదీ ప్రభుత్వం పచ్చజెండా ఊపుతున్నట్లు తెలుస్తోంది. ఈఅంశాన్ని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రస్తావించింది. పార్లమెంట్‌తోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నామని స్పష్టం చేసింది. జమిలి ఎన్నికలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, సీఈసీతో చర్చించామని వెల్లడించింది. దీనిపై ఎన్డీఏ కూటమితో చర్చించామని తెలిపింది. జమిలి ఎన్నికలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కొన్ని మార్పులు చేసిందని..వాటిని లాకమిషన్ పరిశీలిస్తోందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. త్వరలో ఎన్నికల సాధ్యాసాధ్యాలపై లా కమిషన్ నుంచి క్లారిటీ రానుంది. వేర్వేరుగా ఎన్నికలు జరగడం వల్ల ప్రజా ధనం దుర్వినియోగం అవుతోందని..2014 నుంచి ఇప్పటివరకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేశామని పార్లమెంట్‌లో వివరించింది.ఎన్నికల నిర్వహణ ఆర్థిక భారంతో కూడుకుందని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పార్లమెంట్, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని..దీని వల్ల ప్రజా ధనం ఆదా అవుతుందని బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి భావిస్తోంది. 2016లో ప్రధాని మోదీ తొలిసారి జమిలి ఎన్నికల అంశాన్ని ప్రస్తావించారు. అప్పటి నుంచి వన్ నేషన్-వన్ ఎలక్షన్ అనే అంశం తెరపైకి వస్తూనే ఉంది. ఇప్పటివరకు 1952 నుంచి 1967 మధ్యలో నాలుగు సార్లు దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత రాజకీయ పరిణామాలతో కొన్ని రాష్ట్రాల్లో ముందస్తు ఎన్నికలు జరిగాయి. మరి కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలిపోయాయి. దీంతో అప్పటికప్పుడు ఎన్నికలు అనివార్యం అయ్యాయి. ఈక్రమంలో జమిలి ఎన్నికల అంశం కనుమరుగు అయ్యింది. అప్పటి నుంచి ఐదేళ్లు పూర్తి అయిన ప్రతి రాష్ట్రంలో ఎన్నిలను నిర్వహిస్తున్నారు.లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అంశం ప్రస్తుతం లా కమిషన్ పరిధిలో ఉన్నదని, ఎలాంటి సంస్కరణలు తీసుకురావాలన్న అంశం మీద సమాలోచనలు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. గతంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ అంశంపై చర్చించి కొన్ని సిఫారసులు చేసిందని గుర్తు చేసింది. జమిలి ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే పలు రాజకీయ పార్టీలతో సంప్రదింపుల ప్రక్రియ పూర్తయిందని, లా కమిషన్ తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా స్పష్టత వస్తుందని కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రెజిజు లోక్‌సభలో ఎంపీ అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు.లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుగుతున్నందున సమయంతో పాటు డబ్బు కూడా వృథా అవుతున్నదని, పరిపాలనా సంబంధమైన సమస్యలు కూడా తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అయ్యే వ్యయం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తూ ఉన్నదని, అసెంబ్లీ ఎన్నికల ఖర్చును రాష్ట్రాలు భరిస్తున్నాయని వివరించారు. ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నప్పుడు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం చొప్పున భరిస్తున్నట్లు పేర్కొన్నారు.ఒక్కో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎలక్షన్ కమిషన్ రూపొందించే ఎన్నికల షెడ్యూలుకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు కనిష్టంగా 37 రోజుల నుంచి గరిష్ఠంగా 80 రోజుల సమయం పడుతున్నదని వివరించారు. లోక్‌సభ, అసెంబ్లీలకు కలిపి జమిలి ఎన్నికలను నిర్వహించడంపై గతంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ లోతుగా అధ్యయనం చేసి ఎంపీలతో చర్చలు జరిపి కొన్ని సూచనలు, సిఫారసులు చేసిందని, అనేక ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే వాటిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం.. మరింత సంప్రదింపుల ప్రక్రియ కోసం ఎన్నికల కమిషన్‌కు, లా కమిషన్‌కు పంపినట్లు తెలిపారు.స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసులు, రూపొందించిన నివేదికను లా కమిషన్ అధ్యయనం చేస్తున్నదని, త్వరలోనే ప్రణాళిక రూపొందించనున్నదని, ప్రస్తుతం ఆ పనిలోనే కమిషన్ నిమగ్నమైందని స్పష్టం చేశారు. తరచూ ఎన్నికలు జరుగుతున్నందున ఎలక్షన్ కోడ్‌తో ప్రజలకు అందాల్సిన నిత్యావసర సేవలు, పరిపాలనా సంబంధమైన అంశాలకు విఘాతం కలుగుతున్నదని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. పార్లమెంటుకు, అసెంబ్లీలకు వేరువేరుగా ఎన్నికలు జరుగుతున్న కారణంగా భారీ స్థాయిలో ప్రజాధనం ఖర్చవుతుందని, ఒకేసారి కలిపి జరిగితే తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. జమిలి ఎన్నికలకపై వివిధ పార్టీలతో ఇప్పటికే కేంద్ర ఎలక్షన్ కమిషన్ సంప్రదింపులు జరిపి అభిప్రాయాలను సేకరించిందని గుర్తుచేశారు.

# కుప్పం పరిస్థితి తారుమారు అవుతుందా

తిరుపతి, జూలై 23, ఆపరేషన్ సక్సెస్ బట్ పేషెంట్ డెడ్ అన్నట్టుగా ఆ కీలక మున్సిపాలిటీలో వైసీపీ పరిస్థితి ఉందట. రాష్ట్రవ్యాప్తంగా చర్చగా మారినచోట గ్రూపుల కుప్పగా తయారై తన్నుకుంటున్నారట నాయకులు. పదవులు చేపట్టాక పరిస్థితి మారిపోయిందనేది కేడర్ చెప్పేమాట. అదెక్కడో ఈ స్టోరీలో చూద్దాం.కుప్పంలో సార్వత్రిక ఎన్నికల నుంచి పంచాయితీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల వరకు పక్కాగా గేమ్ ప్లాన్ రచించింది వైసీపీ. ఆ వ్యూహాలకు అనుగుణంగా ఫలితాలు సాధించింది. కుప్పంలో జరిగిన తొలి మున్సిపల్ ఎన్నికల్లో 25 వార్డులకుగాను 19 చోట్ల వైసీపీ అభ్యర్థులు గెలిచారు. ఈ విజయం టీడీపీకి పెద్ద షాక్ ఇచ్చింది. 2024లో ఎమ్మెల్యే సీటే లక్ష్యంగా అధికారపార్టీ పావులు కదుపుతున్న వేళ.. కొత్త రగడ చర్చగా మారింది. మున్సిపల్ ఎన్నికలు జరిగి ఏడాది తిరక్కుండానే నేతలు తన్నులాటలు పరిస్థితిని మార్చేసిందటమున్సిపల్ కౌన్సిలర్లు అంతా ఎవరికి వారు యమునా తీరే అన్నట్టుగా ఉంటున్నారట. లోకల్ కేడర్‌కు కూడా అందుబాటులో ఉండటం లేదని ఆరోపిస్తున్నారు. సమస్యలపై చెప్పుకొందామన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని.. ఎవరికి చెప్పాలో కూడా తెలియడం లేదని వాపోతున్నారట పార్టీ కేడర్. మున్సిపల్ ఛైర్మన్‌గా డాక్టర్ సుధీర్ ఉన్నారంటే ఉన్నట్టు అని చెప్పుకోవాల్సి వస్తోందట. ఆయన్ని ఉత్సవ విగ్రహంగా కూర్చోబెట్టి మొత్తం వ్యవహారాలన్నీ వైస్ ఛైర్మన్ మునుస్వామి నడిపిస్తున్నారనేది పార్టీలో వర్గం ఆరోపణ. ఇది సుధీర్ వర్గానికి అసలు రుచించడం లేదట. ఇంతలో 19 కౌన్సిలర్లలో 11 మంది ఛైర్మన్ సుధీర్‌పై మంత్రి పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేశారట.ఛైర్మన్ పట్టించుకోకపోవడం వల్ల వార్డుల్లో ఎలాంటి పనులు చేయలేకపోతున్నామని కౌన్సిలర్లు మంత్రికి చెప్పినట్టు తెలుస్తోంది. ఇదే కాదు.. మున్న 19 మందిలో కొందరు సుధీర్ వెంట.. కొందరు ఎమ్మెల్సీ భరత్ వెంట.. ఇంకొందరు మంత్రి శిబిరంలో కొనసాగుతున్నారు. ఈ గ్రూపుల గోల చూశాక.. కుప్పంలో గెలిచామన్న సంతోషం కూడా ఆవిరవుతోందని శ్రేణులు వాపోతున్నాయట. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కోసం 67 కోట్ల పనులు ప్రతిపాదనలు పంపినా.. వాటి గురించి పట్టించుకునే వారే లేరట. ఈ నిర్లక్ష్యం రానున్న రోజుల్లో తమ సీటుకు..

పార్టీకి ప్రతికూలంగా మారే ప్రమాదం ఉందనేది కొందరు కౌన్సిలర్ల ఆందోళన.టీడీపీ నుంచి గెలిచిన కౌన్సిలర్ హాఫీజ్‌ను మరో వైస్‌ఛైర్మన్ చేయడం వైసీపీ కౌన్సిలర్లు జీర్ణించుకోలేకపోతున్నారట. పార్టీ కోసం తాము కష్ట పడితే.. పార్టీ మారిన వారికి పదవులు ఎలా కట్టబెడతారని ఇప్పటికీ ప్రశ్నలు సంధిస్తున్నారు. కుప్పం వైసీపీ ఇంఛార్జ్‌గా ఉన్న ఎమ్మెల్సీ భరత్, మంత్రి పెద్దిరెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నా.. గ్రూప్‌వార్ పీక్స్‌కు చేరుకోవడం కేడర్‌కు మింగుడు పడటం లేదు. కలిసి సాగకపోతే 2024 నాటికి పార్టీ బలపడేది ఎలా అనేది కొందరి ప్రశ్న. ఇప్పటికే పలుమార్లు స్థానిక నేతలకు పార్టీ పెద్దలు క్లాస్ తీసుకున్నా.. ఏదో ఒక సమస్య తెరపైకి వస్తోంది. అయితే కుప్పం మున్సిపాలిటీలో వైసీపీ నేతల మధ్య తలెత్తిన గొడవలు మాత్రం ఓ రేంజ్‌లో ఉన్నాయి. మరి.. వీటిని పార్టీ పెద్దలు ఎలా పరిష్కరిస్తారో చూడాలి.

# మహానాడు ఊపుతో జనాలు

విజయవాడ, జూలై 23,చంద్రబాబు ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. మహానాడు తెచ్చిన ఊపుతో ఆయన జనంలోకి వెళుతున్నారు. బాగానే ఉంది. తాను అభ్యర్థులను ఎన్నికలకు ఆరు నెలల ముందే ప్రకటిస్తామని చంద్రబాబు పదే పదే చెప్పారు. పార్టీలో ఎవరు కష్టపడితే వారికే టిక్కెట్లు అని కూడా ఖరాఖండీగా చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితిని చూస్తే కొన్ని జిల్లాల నేతలు తప్ప ఎక్కువ మంది నేతలు ఇప్పటికీ యాక్టివ్ గా లేరు. నియోజకవర్గాల్లో నేతలను యాక్టివ్ చేయడం కోసమే మినీ మహానాడులను ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ జనసమీకరణకు మాత్రం ఖర్చు తాము భరించలేమని కొందరు నేతలు చేతులెత్తేసినట్లు కనపడుతుంది. నిధుల కోసం కేంద్ర కార్యాలయం కోసం ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికల్లో ఎక్కువ ఖర్చు పెట్టి కొందరు ఉన్న సొమ్మునంతా ఖర్చు చేసుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలంటే పార్టీ ఇచ్చే నిధులు అరకొర ఉంటాయి. అవి ఏమాత్రం సరిపోవు. తాము అప్పో సప్పో చేసి ఎన్నికలకు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఉన్న ఆస్తులను కూడా అమ్ముకోవాల్సి ఉంటుంది. మంత్రాలయం టీడీపీ ఇన్‌ఛార్జి తిక్కారెడ్డి అన్నట్లుగానే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆయన అన్న మాట అక్షర సత్యమని అనేక మంది నేతలు అంటున్నారు. అందుకే నేతలు ఎన్నికలకు రెండేళ్లకు ముందుగానే ఖర్చు చేయడానికి ఇష?టపడటం లేదు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే మినీ మహానాడులు జిల్లాలోని ఒక నియోజకవర్గంలోనే జరుగుతున్నాయి. ఉదాహరణకు మదనపల్లె లో మినీ మహానాడు జరిపితే అక్కడ అభ్యర్థికి మాత్రమే కొంత ప్రయోజనం ఉంటుంది. ఇతర నియోజకవర్గాల నేతలకు ఏ మాత్రం ప్రయోజనం లేదు. అందుకే రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలు, కోస్తాంధ్రలోని కొన్ని నియోజకవర్గాలు, ఉత్తరాంధ్రలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని పదిహేను నియోజకవర్గాల్లో నేతలు ఖర్చుకు వెనకాడుతున్నారని కేంద్ర కార్యాలయానికి వచ్చిన నివేదికను బట్టి తెలుస్తోంది. దీంతో పాటు ఇప్పటి వరకూ రాష్ట్రంలో 30 నియోజకవర్గాలకు ఇన్ ఛార్జులు లేరు. వారిని నియమించేందుకు అనేక సమస్యలను అధినేతకు ఎదురవుతున్నాయి. అందుకే ఇన్‌ఛార్జుల నియామకంలో జాప్యం జరుగుతుంది. అక్కడ కూడా నేతలెవ్వరూ ఖర్చు చేసేందుకు అసలు ముందుకు రావడం లేదు. ఈ రెండేళ్లు మాత్రం చంద్రబాబు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా అందుకయ్యే ఖర్చును పార్టీయే భరించాల్సి ఉంటుంది. నియోజకవర్గాల్లో నేతలు చేతులు ఎత్తివేయడంతో ఆయన కూడా కొన్ని డిజైన్ చేసిన కార్యక్రమాలను కూడా వాయిదా వేసుకుంటున్నారని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. కేంద్ర కార్యాలయం ఖజానాపై భారం ఎక్కువగా పడుతుండటం కూడా పార్టీలో చర్చనీయాంశమైంది. అందుకే ఇటీవల కాలంలో లోకేష్, చంద్రబాబులు తమ పర్యటనలను కుదించుకుంటున్నారు. ప్రధాన కార్యక్రమాలు తప్ప ఇదివరకు మాదిరిగా పార్టీ అగ్రనేతలు జిల్లాల్లో పర్యటించేందుకు వీలులేదన్నది వాస్తవం.

# పాపం... ఆలీ



గుంటూరు, జూలై 23, అసలు దురదంటూ రాకూడదు కానీ, వచ్చిందంటే ఇక అంతే, గోక్కుంటూనే ఉండాలి...ఆ దురద రాజకీయ దురదయితే, ఇక చెప్పనే అక్కరలేదు. కంటికి కనిపించకుండా అలా గోకుతూ...నే ఉంటుంది. పొరుగువాడిని పట్టుకుని మరీ గోకమంటుంది. నువ్వు గోకినా గోకక పోయినా నేను మాత్రం గోకుతూనే ఉంటానంటూ వెంటపడి మరీ గోకుతుంది. లేదు, లేదు మీరు పొరపడుతున్నారు, ఈ గోకుడుకు ఆ గోకుడుకు అసలు సంబంధమే లేదు. నో రిలేషన్, ఎటాల్ ఐ సే .. సంబంధమే లేదు అన్నమాట. నేను మాట్లాడుతున్నది, కేసీఆర్ సార్ వినిపించిన గోకుడు పురాణంలోని గోకుడోపఖ్యానం గురించి కానే కాదు. ఇదంతా మా ఆలీ గోకుడు గోల, ఎస్.. అవును.. మనం ఇప్పుడు మాట్లాడుకుంటోంది సరదాగా అలీతో .. కూర్చి... గురించి అన్నమాట. ఎస్...కమెడియన్ ఆలీకి ఎప్పుడు ఎక్కడ ఎలా తగిలిందో ఏమో కానీ, రాజకీయ దురద గుంటాకు, ఒళ్లంతా తాకేసింది. ఇక అక్కడ నుంచి ఆలీని రాజకీయం రాజకీయాలను ఆలీ గోకుతూనే ఉన్నారు. అయితే, అదేమిటో కానీ, ఆలీ సినిమాల్లోనే కాదు, రాజకీయాల్లోనూ కమెడియన్' గానే మిగిలి పోయారు. పాపం ... ఫర్ ది లాస్ట్ త్రీ ఫోర్ ఇయర్స్, పొలిటికల్ ఎంట్రీ కోసం ... కనిపించిన వారందరినీ గోకుతూనే ఉన్నారు. లాస్ట్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు , ఆయన ఓకే ఈసారి.. ముగ్గురు నాయకులను గోకారు .. మూడు పార్టీలలో చేరి పోయినంత పనిచేశారు. ఓ ఫైన్ మార్నింగ్ ఆయన పొద్దుగాల, పొద్దుగాల లేస్తూనే... పాదయాత్రలో ఉన్న వైసీపీ అధినేత జగన్ రెడ్డి తలుపు తట్టారు. సో ..న్యాచురల్లీ ఆయన వైసీపీలో చేరిపోతున్నారని స్క్రోలింగ్ లు పరుగులు తీశాయి. ముహూర్తం, వేదిక ఎవ్రీథింగ్ ఫిక్స్ అయి పోయాయి. బట్ ..ద వెరీ నెక్స్ట్ డే .. అలీ కామెడీగా అమరావతిలో వాలిపోయారు, ఎక్కడేమిటి, టీడీపీ అధినేత చంద్రబాబు ఇంట్లో .. ఆయనతో ఓ గంటో రెండు గంటలో భేటీ జరిపి బయట కొచ్చారు .. ఆతర్వాత టీవీ స్క్రోలింగ్స్ ఫాలో అయ్యాయి. అయితే .. అంతే కాదు .. అంతే అయితే అందులో 'పంచ్' ఏముందని పవన్ కళ్యాణ్ ఇంటి కెళ్ళారు.మిగిలిన కథంతా సేమ్.. టూ... సేమ్.. అదేదో సినిమాలో బండి మీద ఇసుక మూట పెట్టుకుని బోర్డర్ దాటేస్తాడు చూడండి .. కామెడిగా అలాగన్న మాట.. అయితే చివరకు ఆయన, ఆ ఎన్నికల్లో పోటీ అయితే చేయలేదు కానీ, వైసీపీ తరపున ప్రచారం చేశారు. ఇక అక్కడి నుంచి చకోర పక్షిలా ఏదో ఒక పదవి వస్తుందని ఎదురు చూస్తూనే ఉన్నారు.. జగనన్న పదవి ఇవ్వక పోతారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆ మధ్యనో మారు జగనన్న పిలిచారని, కొత్త బట్ట లేసుకుని తాడేపల్లి ప్యాలెస్ లో వాలి పోయారు అలీ. ముఖ్యమంత్రిని కలిశారు.ఆతర్వాత మీడియా ముందు కొచ్చిన అలీ, ముసి ముసిగా మురిపెంగా నవ్వుతూ, "ఈ రోజు రమ్మని పిలిచారు. వచ్చాను. ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని కలిశాను, అతి త్వరలోనే పార్టీ ఆఫీసు నుంచి శుభవార్త వస్తుందని తెలిపారు. ఏ పదవి ఇస్తారన్నది మాత్రం చెప్పలేదని' ఆనందంలో ఉబ్బితబ్బిబయ్యారు. సిగ్గులొలక పోశారు. రాజ్యసభ టికెట్ మొదలు వక్ఫ్ బోర్డు చైర్మన్' వరకు ఏదో ఒక పదవి వస్తుందని,ఆయన ఎదరుచూస్తున్నారు. పదవుల పందేరం అయిపొయింది, రాజ్య సభ టికెట్ పక్క రాష్ట్రానికి చెందిన బీసీ నేత ఆర్. కృష్ణయ్యకు ఇచ్చారు కానీ, అలీకి మాత్రం శుభ వార్త రాలేదు. గతంలో 30 ఇయర్స్ ఇండస్ట్రీ ప్రుధ్వీరాజ్ కూడా ఇలాగే, జగన్ రెడ్డి మీద చాలా ఆశలు పెట్టుకుని అటూ ఇటూ కాకుండా పొయారు .. ఎంద చాట.. కాత్రవల్లి .. అంతేనా అలీ .

# లాస్ట్ నుంచి ఐటీ ర్యాంకింగ్స్ లో

విశాఖపట్టణం, జూలై 23, ఒకప్పుడు ఐటీ అంటే ఏపీ నంబర్ వన్ అనుకునేది ప్రపంచం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే కాదు, విభజిత ఆంధ్రప్రదేశ్ లో కూడా చంద్రబాబు హయాంలో ఐటీ పరుగులు తీసింది. బెంగళూరు చెన్నైలను మించి ఇక్కడ తమ సంస్థలను ఏర్పాటు చేయడం కోసం ఐటీ పరిశ్రమలు పోటీలు పడేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు హయాంలో బెంగళూరు దిగదుడుపే అన్నట్లుగా ఏపీ పరిస్థితి ఉండేది.ఐటీ ర్యాంకింగ్స్ లో ఏపీ మేటిగా ఉండేది. అయితే ఇదంతా గతం. ఇప్పుడు ఐటీ విషయంలో ఏపీ పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. ముఖ్యంగా ఐటీ రంగంలో తాజాగా విడుదలైన ర్యాంకింగ్స్ లో దేశంలోనే అట్టడుగు స్థానంలో నిలిచింది ఆంధ్రప్రదేశ్. చంద్రబాబు వేసిన పునాదిని అలంబనగా చేసుకున్న తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది.స్టార్టప్స్ ఎకోసిస్టం విషయంలో తాజా ర్యాంగింక్సలో ఏపీ పరిస్థితి ఇది. ఇదొక్కటే కాదు.. ఏ రంగం తీసుకున్నా పొరుగు రాష్ట్రమైన తెలంగాణ పైపైకి వెడుతుంటే.. ఏపీ మాత్రం కిందకి దిగజారిపోతోంది. తాజాగా విడుదల చేసిన ఇన్నోవేషన్ ర్యాంకింగ్స్‌లో కూడా గతంలో ఉన్న మెరుగైన స్థానాన్ని ఏపీ కోల్పోయింది.సృజనాత్మకత, పెట్టుబడుల ఆకర్షణ, విద్య, హ్యూమన్ ఇండెక్స్ అంశాల ఆధారంగా ఎంపిక చేసిన ఇన్నోవేషన్ ర్యాంకింగ్స్‌లో కర్ణాటక ఫస్ట్ ప్లేస్‌లో నిలిస్తే తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. అన్ని రంగాల సగటును పరిగణనలోకి తీసుకుంటే ఉత్తమ పనితీరు కనబర్చి 'బెస్ట్ పర్‌ఫార్మర్ స్టేట్'గా తెలంగాణకు మొదటి స్థానంలో నిలిస్తే.. ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. గత ఏడాది నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మూడు స్థానాలు దిగజారిపోయింది. పలు అంశాలపై నీతి ఆయోగ్, కాంపెటెటివ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తగా 2021 సంవత్సరానికి చేసిన అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడించింది

# మిర్చి..మహా ఘాటు గురూ



గుంటూరు, జూలై 23,మిర్చి ధరల పెరుగుదల గత కొన్ని రోజులుగా కొనసాగుతోంది. గుంటూరు మిర్చి యార్డులో గురువారం రికార్డు స్థాయిలో కొన్ని రకాల మిర్చి ధరలు పెరిగాయి. 2043 బాడిగ రకం మిర్చి క్వింటాలు రూ.33 వేలు పలికింది. గత నాలుగేళ్లలో ఇంత ధర ఎప్పుడూ లభించలేదని వ్యాపార వర్గాలు తెలిపాయి. వేసవి సెలవులకు ముందు రూ.18 వేలులోపు పలికిన వివిధ రకాల మిర్చి ధరలు సీజన్ ముగిసిన తరువాత భారీగా పెరిగాయి. రికార్డు స్థాయిలో గరిష్టంగా క్వింటాలు రూ. 29 వేల నుంచి రూ.33 వేల వరకు పలుకుతున్నాయి. అయితే, ధరల పెరుగుదల వల్ల వ్యాపారులకు, దళారులకు తప్ప రైతులకు కలిగే ప్రయోజనం స్వల్పంగా ఉంది. చైనా, వియత్నాం, బంగ్లాదేశ్, స్వీడన్ తదితర దేశాల నుంచి ఆర్డర్లు వచ్చాయి. దీంతో, ధర పెరిగింది. ఇప్పటి వరకు మిర్చిని నిల్వ చేసిన వ్యాపారులకు బాగా కలసి వచ్చింది. వేసవి సెలవులకు ముందు వచ్చిన ధరల కన్నా ఇప్పుడు క్వింటాలుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అధిక ధరలు లభిస్తున్నాయి. ఈ రెండు జిల్లాల్లోని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన వ్యాపారులు, కొంతమంది రైతులకు ఇప్పుడు బాగా లబ్ధిపొందుతున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని కోల్డ్ స్టోరేజిల్లో ప్రస్తుతం 40 లక్షల వరకు మిర్చి టిక్కిలు నిల్వ ఉన్నాయి. ఇందులో 30 లక్షల టిక్కిలు వ్యాపారులకు, మిగిలినవి రైతులకు సంబంధించినవని సమాచారం. రైతులకు వివిధ రూపాల్లో పెట్టుబడి పెట్టే వ్యాపారులు ముందస్తు అవగాహన కుదుర్చుకుని రైతుల పేరున కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయడం పరిపాటిగా మారింది. నాన్ ఎసి కామన్ వెరయిటీ సగటు ధర క్వింటాలు గరిష్టంగా రూ. 25,500 వేలు పలికింది. నాన్ ఎసి స్పెషల్ వెరయిటీ సగటు ధర రూ.26 వేలు వచ్చింది. ఎసి కామన్ వెరయిటీ గరిష్ట ధర రూ.25,500 పలికింది. ఎసి స్పెషల్ వెరయిటీకి క్వింటాలుకు రూ.25 వేలు ధర వచ్చింది. మిర్చిలో అత్యధిక డిమాండ్ ఉన్న తేజ, బాడిగ రకాలు రాష్ట్రంలో పండిన వాటికి మాత్రం క్వింటాలు రూ.30 వేల నుంచి రూ.33వేల వరకు పలికినట్టు ప్రముఖ మిర్చి వ్యాపారి పులగం సురేష్ రెడ్డి తెలిపారు. 355 బాడిగ రకం మిర్చి గరిష్టంగా రూ.29,500 వేలు పలకగా, 341 బెస్టు రకం క్వింటాలు రూ.29,000కు కొనుగోలు చేశారు. 2043 బాడిగ రకం మిర్చికి రూ.33 వేలు, సీజెంటా బేడిగ రకం మిర్చికి రూ.29 వేలు వరకు ధర లభించింది. నెంబరు 5 డీలక్స్ రకానికి రూ.27,500, దేవనూరు డీలక్స్ రకం రూ.28,500 ధర వచ్చింది. తామర తెగులు తట్టుకుని నిలదొక్కుకున్న మిర్చి వెరయిటీలు గత రెండు నెలల క్రితమే యార్డుకు వచ్చాయి. రైతుల వద్ద గరిష్టంగా క్వింటాలు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఇప్పుడు రూ.25 వేల నుంచి రూ.30 వేలకు పైగా విక్రయించుకుంటున్నారు. గుంటూరు మార్కెట్లో రిటైల్ ధర కిలో రూ.275 నుంచి రూ.350 వరకు పలుకుతోంది.

# పరిశ్రమలకు నీటి భారం

నెల్లూరు, జూలై 23, (రాష్ట్రంలోని పరిశ్రమలకు అందిస్తోన్న నీటికి వసూలు చేస్తోన్న ఛార్జీలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలన్న తేడా లేకుండా వాటిన్నింటినీ ఒకేగాట్టిన కట్టింది. అన్నింటికీ ఆరు రెట్లు నీటి సరఫరా ధరను పెంచుతూ ఈ ఏడాది జనవరి 12న జిఒ నెంబరు ఒకటిని విడుదల చేసింది. నీటి ఛార్జీల పెంపుపై పరిశ్రమల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించడంతో ఈ జిఒ వ్యవహారం బయటకొచ్చింది. పెంచిన ధర అమల్లోకి వస్తే పరిశ్రమలపై కోట్ల రూపాయల నీటి భారం పడనుంది. తామీ భారం భరించలేమని చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులు తెగేసి చెబుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పలు పరిశ్రమలకు, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి)కు విశాఖపట్నం ఇండిస్టియల్ వాటర్ సప్లై కంపెనీ (విస్కో) నీటిని సరఫరా చేస్తోంది. నీటి ధర పెంపుపై వెంటనే అమల్లోకి వెళ్లకుండా ముందుగా పరిశ్రమల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో, నెల రోజుల క్రితం పరిశ్రమల ప్రతినిధులతో విస్కో అధికారులు సమావేశం నిర్వహించారు. ప్రస్తుతమున్న ధరకు ఆరు రెట్లు పెంచడం వల్ల పరిశ్రమలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్న ప్రతినిధుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించారు. కొత్త జిఒ అమల్లోకి వస్తే పరిశ్రమలకు విస్కో సరఫరా చేస్తున్న నీటి ధరలు పెరగనున్నాయి. స్టీల్‌ప్లాంట్‌కు 25 మిలియన్ గ్యాలన్స్ ఫర్ డే (ఎంజిడి), ఎన్‌టిపిసి, ఎపిఐఐసికి 6.7 ఎంజిడి, గంగవరం పోర్టుకు 0.3 ఎంజిడి నీటిని విస్కో సరఫరా చేస్తోంది. ప్రస్తుతం ఎన్‌టిపిసి, స్టీల్‌ప్లాంట్‌కు సరఫరా చేస్తున్న వెయ్యి లీటర్ల నీటికి రూ.19.22 చొప్పున వసూలు చేస్తోంది. ఎపిఐఐసి, గంగవరం పోర్టు నుంచి వెయ్యి లీటర్ల నీటికి రూ.20 చొప్పున సరఫరా చేస్తోంది. రూ.19.22 చొప్పున 25 ఎంజిడిల నీటికి రోజుకు సుమారు 21.84 లక్షల రూపాయలు స్టీల్‌ప్లాంట్ చెల్లిస్తోంది. కొత్త ధర అమల్లోకి వస్తే 1.36 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లూ పని చేస్తే రోజుకు 40 ఎంజిడిల నీరు అవసరం కానుంది. ఆ మేరకు నీటి భారం మరింత పెరగనుంది.

విస్కో సరఫరా చేస్తోన్న నీటిని పరవాడ ఫార్మా, అచ్యుతాపురం, రాంబిల్లిలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్), నాన్ సెజ్‌లోని పరిశ్రమలకు ఎపిఐఐసి అందిస్తోంది. ఎపిఐఐసి ప్రస్తుతం రూ.20 చొప్పున 6.7 ఎంజిడిలకు రోజుకు 6.09 లక్షలు చెల్లిస్తుండగా, పెరిగిన ధర అమల్లోకి వస్తే రూ.36.54 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. ప్రస్తుతం తామింకా పాత ధర ప్రకారమే నీటిని సరఫరా చేస్తున్నామని విస్కో అధికారులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాక పెంచిన ధర వర్తింపజేస్తామన్నారు.

# జనసేన పార్టీతో బీజేపీ మైత్రి లవ్ అండ్ హేట్

విజయవాడ, జూలై 23, పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీతో బీజేపీ మైత్రి లవ్ అండ్ హేట్ చందంగా కొనసాగుతోంది. ప్రసిద్ధ కథా రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్ర కథ యావజ్జీవం హోష్యామిలో నిత్యం గొడవపడుతూ కలిసి జీవించే దంపతుల్లా జనసేన, బీజేపీ మైత్రి కొనసాగుతోంది. ఏపీలో ఎన్నికల హీట్ పెరుగుతున్న కొద్దీ ఈ రెండు పార్టీల మధ్యా మైత్రి రంగులు మార్చుకుంటోంది. తగవులు పడుతోంది.. కలిసి సాగుదాం అంటోంది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా తనను అంగీకరించాలని బీజేపీతో మైత్రికి జనసేనాని షరతు పెడితే.. మా పార్టీ ఎవరినీ భుజాన మోయదని బీజేపీ బెట్టు చేస్తున్నది.ప్రధాని నరేంద్రమోడీ హాజరైన భీమవరం సభకు జనసేనానిని నువ్వు రావద్దుసుమా అని నోటితో చెబుతూ సభకు రావాలంటూ ఓ ఆహ్వానం పడేసింది బీజేపీ.. అలిగిన జనసేనాని ఆ సభకు దూరంగా ఉండిపోయారు. ఆ తరువాత మేం ఆహ్వానించాం మీరే రాలేదంటూ బీజేపీ సన్నాయి నొక్కులు నొక్కితే.. వద్దామనే అనుకున్నా, కానీ స్థానిక ఎంపీని ఆహ్వానించకుండా నన్న ఆహ్వానించడం, నేను రావడం మర్యాద కాదని దూరంగా ఉన్నానని జనసేనాని వివరణ ఇచ్చారు. సరే అది ముగిసిన కథ.. ఇప్పుడు మళ్లీ ఈ ఆహ్వానం కథే మరో చోట మరోలా ఆరంభమైంది. ఆ కథేమిటంటే పదవీ విరమణ చేయనున్న రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కు కేంద్రం పవన్ కల్యాణ్ ను ప్రత్యేకంగా ఆహ్వానించింది. వాస్తవానికి ఈ కార్యక్రమానికి ప్రొటో కాల్ ప్రకారం పవన్ ను ఆహ్వానించాల్సిన అవసరం లేదు. ఉప రాష్ట్రపతి, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల సీఎంలు మాత్రమే ఆహ్వానితుల జాబితాలో ఉంటారు. అయినా కూడా పెద్ద మనసు చేసుకుని ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు జనసేనాని పవన్ కల్యాణ్ కు ప్రత్యేకంగా ఆహ్వానించి తప్పని సరిగా రావాలని కోరారు.దీనిని బట్టి పవన్ ను బీజేపీ దూరం పెట్టే ప్రశక్తే లేదనీ, వచ్చే ఎన్నికలలో రెండు పార్టీలూ కలిసే పోటీ చేస్తాయని విశ్లేషణలు వెల్లువెత్తాయి. అయితే తనకు ఆహ్వానం వచ్చిందని ధృవీకరించిన పవన్ కల్యాణ్ ఆ ఆహ్వానాన్ని అనివార్య కారణాల వల్ల మన్నించలేకపోతున్నానని చెప్పేశారు. ఆరోగ్యం బాలేదనీ, అందుకే వెళ్లడం లేదనీ చెబుతూ, పనిలో పనిగా రామ్ నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా తన పదవీ కాలంలో క్రియాశీలంగా వ్యవహరించారనీ, పదవికి వన్నెతెచ్చారని ప్రశంసించేశారు. అయితే ఇంతకీ మోడీ స్వయంగా ఆహ్వానించినా పవన్ ఎందుకు స్పందించడం లేదు అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి బీజేపీ, జనసేన మధ్య మూడేళు ‌గా మైత్రి కొనసాగుతున్నా.. ఈ మూడేళ్లలో కేవలం ఒక్కటంటే ఒక్క సారి మాత్రమే పవన్ కల్యాణ్ మోడీతో భేటీ అయ్యారు.ఈ మధ్య కాలంలో పలు మార్లు మోడీతో భేటీ అవకాశం కలిగినా, స్వయంగా మోడీయే పిలిచినా పవన్ కల్యాణ్ ఆయనను కలిసే యత్నం చేయలేదు. విశాఖ స్టీలు ప్లాంట్ ఇష్యూలో పవన్ నేరుగా హోం మంత్రి అమిత్ షానే కలిశారు. స్టీల్ ప్లాంట్ స్థితిగతులపై చర్చించారు. పలు సందర్భాల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కూడా కలిశారు. కానీ ఇంతవరకూ ప్రధాని మోదీని మాత్రం కలవలేదు. ఏపీలో టీడీపీ, జనసేన మధ్య పొత్తులు చిగురిస్తున్నట్టు వస్తున్న వార్తల వేళ.. పవన్ రామ్ నాథ్ కోవింద్ వీడ్కోలు సభకు గైర్హాజర్ కావాలని తీసుకున్న నిర్ణయం పలు సందేహాలకు తావిస్తున్నది. ఒక వైపు బీజేపీ 2024 ఎన్నికల్లో జనసేనతో కలిసి పోటీచేస్తామని గంటా పథంగా చెబుతూ వస్తోంది.అయితే పవన్ మాత్రంమరో ఉద్దేశంలో ఉన్నట్లు తన మాటలు, చేతల ద్వారా స్పష్టంగానే తెలియజేస్తున్నారు. గత రెండు సార్లు తాను తగ్గానని.. ఇక తనకు ఈసారి అవకాశాన్ని వదిలేయాలని ఆయన సూటిగా కాకపోయినా పరోక్షం గానైనా బీజేపీకి తెలియజేశారు. అదే సమయంలో తెలుగుదేశానికి అన్యాపదేశంగా అదే సూచన చేశారు. దీంతో జనసేనతో పొత్తు అన్న విషయంలో తెలుగుదేశం ఆచి తూచి అడుగేస్తోంది. పొత్తు ఉంటుందని కానీ ఉండదని కానీ చెప్పడం లేదు. అయినా మహానాడు తరువాత ఆ పార్టీలో స్పష్టమైన మార్పు కనిపించింది. పవన్ ప్రస్తావనే లేకుండా తన పని తాను చేసుకుని పోతోంది. బీజేపీ కూడా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పర్యటన సందర్భంగా పవన్ ను ముఖ్యమంత్రి చేయాలని జనసేన శ్రేణుల నుంచి డిమాండ్ ను పట్టించకోకపోవడం అటుంచి, ఆయన పర్యటన మొత్తంలో కనీసం జనసేన పేరును కానీ, పవన్ కల్యాణ్ ఊసు కానీ రానీయ లేదు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కనిపిస్తున్న ప్రభుత్వ వ్యతిరేకత నేపథ్యంలో బీజేపీ పునరాలోచనలో పడి జనసేనకు అదే సమయంలో తెలుగుదేశం పార్టీకి చేరువయ్యే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. అందుకే జనసేనానికి ఆహ్వానాలు, తెలుగుదేశం పార్టీతో వేదిక పంచుకోవడాలు అని పరిశీలకులు అంటున్నారు.

# చంద్రబాబుది మతి తప్పిన ఆరోపణలు

ఆచంట ఆచంట మండల సర్పంచ్ ల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పై ఫైర్ అయ్యారు.పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం లంక గ్రామాలైన అయోధ్యలంక గ్రామంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ టిడిపి అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వాఖ్యలు అర్ధ రహితం తగదని.లంక గ్రామాలలో వరద బాధితులను పరామర్శించడానికి పర్యటన కు వచ్చిన చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం పైన సీఎం జగన్ పైన అనుచిత వాఖ్యాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.చంద్రబాబు పరామర్శకు వచ్చి రాష్ట్రంలో పులివెందుల పాలన నడుస్తుందని, టిడిపి అధికారంలోకి వస్తే వైసీపీ నాయకులను రోడ్ల మీద తిరగనివ్వమని వాక్యనించడం సిగ్గు చేటు అన్నారు.మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కు మాజీ మంత్రి పితాని కి మతితప్పి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు.లంక గ్రామాల పర్యటనకు వచ్చారా లేక ఎన్నికల ప్రచారానికి వచ్చారో చంద్రబాబు పునరాలోచించుకోవాలన్నారు. లంక గ్రామాల పర్యటన కు వచ్చిన చంద్రబాబు వరద బాధితులకు ఏ సహాయం చేశారో ఒకసారి ఆలోచించుకోవాలి.వరద ప్రారంభం అయినప్పటినుండి మాజీ మంత్రివర్యులు శ్రీరంగనాధరాజు ప్రతి లంక గ్రామానికి మంచినీరు ,ఆహారం అందేలా చూస్తున్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం రెండు వేల రూపాయలు నేరుగా తమ ఖాతాలో జమ చేయడం జరిగింది.చంద్రబాబు లంక గ్రామ ప్రజలకు కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదని ఆరోపించడం వారి నీతిలేని రాజకీయానికి నిదర్శనమన్నారు .ప్రతి రోజు, ఉదయం టిఫిన్ మరియు సుమారు 8,600మందికి భోజనాలు అందిస్తున్నారని నష్టపోయిన ప్రతిపాలానికి,ప్రతి ఇంటికి నష్టపరిహారానికి ప్రభుత్వానికి సిఫార్సు చేయడం జరిగిందని అన్నారు.కేవలం మనుషులకే కాకుండా పశువులకు 50కేజీల ధానా తన సొంత నిధులతో వాటికి ఆహారం లాంటి ఏర్పాటు చేసి దగ్గరుండి పంపించిన ఘనత శ్రీ రంగనాథరాజుది అన్నారు. ఇన్ని చేస్తున్నా కళ్ళబొల్లి ఆరోపణలతో ప్రజలను మభ్యపట్టే విధంగా చంద్రబాబు మాట్లాడటం సిగ్గు చేటు.. సుంకర సీతారాం ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జక్కంశెట్టి చంటి,ఇంచార్జి మొల్లేటీ రామకృష్ణ , మైలే ఏసురత్నం, నాని తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల విలీన ప్రక్రియను ఆపాలి

కడప కార్పొరేషన్ పరిధిలోని చెమ్మియాపేట ప్రాథమిక పాఠశాలను శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెంవిజయభాస్కర్, కాంగ్రెస్ ఎన్.ఎస్.యు.ఐ నేతలు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి సమ స్యలు అడిగి తెలుసుకు న్నారు.విద్యార్థులు తమ బడి తమకే ఉండాలంటూ మేము ఇక్కడే చదువుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాడు నేడు ద్వారా 20 లక్షల రూపాయలు వ్యయంచేసి పాఠశాలను పునరుద్ధరించి నేడు 130 మంది విద్యార్థులు ఉన్న పాఠశాల నుంచి నూరు మందిని మూడు, నాలుగు, ఐదు తరగతులకు సంబంధించిన విద్యార్థులను కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలలోకి విలీనం చేస్తామని చెప్పడం సబబు కాదని అన్నారు. ఉన్నత పాఠశాలలో ఈ వంద మంది విద్యార్థులకు వసతులు, గదులు లేని పరిస్థితి నెలకొందన్నారు . రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయముతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందన్నారు పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుకున్నట్లుగా వారిని అక్కడే ఉంచాలని, ఏదైతే ప్రభుత్వం నిర్ణయించిన జి.ఓ 117 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ నేతలు చంద్రకాంత్, ప్రసాద్, ప్రభుదాస్, వర్ధన్ పాల్గొన్నారు

# కమలానికి కలవరపెడుతున్న సర్వేలు

హైదరాబాద్, జూలై 23, (న్యూస్ పల్స్)కాంగ్రెస్ ముక్త భారత్ బీజేపీ గత ఎనిమిదేళ్లుగా చెబుతున్న మాట.. చేస్తున్న నినాదం. ఇందు కోసం ఆ పార్టీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతూ ముందుకు సాగుతోంది. రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న పట్టు సడలేలా ప్రణాళికలు రచిస్తోంది. కాంగ్రెస్ ను బలహీన పరిస్తే.. జాతీయ స్థాయిలో తమకు పోటీ యే ఉండదన్నది బీజేపీ బావన. కాంగ్రెస్ మినహాయిస్తే జాతీయ స్థాయిలో బలంగా ఉన్న పార్టీ, తమకు పోటీగా నిలిచే పార్టీ మరొకటుండదన్నది కమలనాథుల నిశ్చితాభిప్రాయం. అందుకే కాంగ్రెస్ ను బలహీనపరుస్తే తమకు తమకు తిరుగుండదనే భావనలో బిజెపి నాయకత్వం ఉంది. అందుకు ఆ పార్టీ ఇటీవల పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలే తార్కాణం. కాంగ్రెస్ పార్టీకి బలంగా ఉన్న రాష్ట్రాల్లో పాగా వేసేందుకు కాషాయదళం వ్యూహరచన చే స్తోంది.ఆ వ్యూహాలను అమలు చేస్తున్నది. అందులో భాగంగానే కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు, మద్దతుతో ప్రభుత్వాలను ఏర్పాటుచేసిన రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుని అడుగులు వేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నాగానీ, ఆ పార్టీని వెంటాడుతూనే ఉందనేది కూడా పరిశీలకులు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీతో కలిసి పోయేందుకు ప్రాంతీయ పార్టీలు ఆసక్తిని కనబర్చకుండా బిజెపి కొత్త కొత్త వ్యూహాలను రచిస్తోంది. ఆ వ్యూహాల అమలులో ఉత్తర భారత దేశంలో కాంగ్రెస్ ను దాదాపు నామమాత్రావశిష్టానికి తీసుకు వచ్చేసిందని పరిశీలకులు అంటున్నారు. అక్కడితో ఆగకుండా ఉత్తర భారత దేశంలో కాంగ్రెస్ పుంజుకోవడానికి అవకాశం లేకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోంది. అయితే ఈ వ్యూహాలు దక్షిణాదిలో అంతగా ఫలించడం లేదు. అందులోనూ ముఖ్యంగా తెలంగాణలో కాంగ్రెస్ బీజేపీ వ్యూహాలను ఎదురొడ్డి నిలిచి రోజు రోజుకూ బలోపేతమౌతోందన్నది ఆ పార్టీ శ్రేణులే చెబుతున్న మాట. దక్షిణాదిలోని మిగిలిన రాష్ట్రాలలో కాంగ్రెస్ బలహీన పడినా లేదా పడినట్లు కనిపిస్తున్నా మళ్లీ పుంజుకునే అవకాశాలు ఉన్నాయన్న అంచనాతో బీజేపీ ఆ అవకాశం ఇవ్వకూడదన్న లక్ష్యంతోనే బీజేపీ వ్యూహాలు రచిస్తోంది.ఇప్పటికే కర్ణాటకలో తన రాజకీయ చతురతతో కాంగ్రెస్ బీజేపీ సర్కార్ ను ఏర్పాటు చేసింది. అనంతరం పశ్చిమ ప్రాంతాన తమిళనాడులో బలోపేతానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. బీజేపీ లక్ష్యమైన కాంగ్రెస్ కు అక్కడ ఏ మంత పట్టు లేకపోవడంతో పెద్దగా పట్టించుకోవడం లేదు కేరళలో కూడా బీజేపీ పట్టు సాధించలేకపోయినా.. అక్కడ కాంగ్రెస్ ఏ మంత బలంగా లేదు. అందుకని ఆ రాష్ట్రం కూడా బీజేపీకి పెద్ద ప్రాధాన్యత రాష్ట్రంగా అనుకోవడం లేదు. ఇక మిగిలినవి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ. ఏపీ విషయానికి వస్తే అక్కడ కాంగ్రెస్ ఉనికి నామమాత్రమే. అయినా అక్కడ జనసేనానితో మైత్రి ద్వారా కొద్దో గొప్పో బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నట్లు కనిపిస్తుంది.అయినా ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఇసుమంతైనా లేవు కనుక బీజేపీ అక్కడ ఇప్పటికిప్పుడు బలోపేతం కాలేకపోయినా ఫరవాలేదన్న భావనతలో ఉందని అంటున్నారు. ఇక మిగిలింది తెలంగాణ. ఈ రాష్ట్రం విషయంలోనే బీజేపీ ఒకింత ఆందోళనతో ఉంది. అక్కడ పార్టీ బలోపేతమైదన్న సూచనలు ఉన్నా తాజా సర్వేల ప్రకారం అక్కడ అధికారంలో ఉన్న టీఆర్ఎస్ కు దీటుగా, ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ ఉ ఒదన్న విషయం వెల్లడైంది. ఇదే బీజేపీని ఆందోళనకు గురి చేస్తున్నది. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యానికి తెలంగాణ అడ్డుగా నిలుస్తుందన్న భావనతతో ఉన్న కమల నాథులు అందుకే తెలంగాణపై దృష్టి కేంద్రీకరించారు.

# ఏపీపీఎస్సీ పరీక్షలు విజయవంతం చేయాలి

కడప ఈనెల 24న జరగనున్న ఏపీపీఎస్సీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ గ్రేడ్-3 (ఎండోమెంట్స్) ఉద్యోగ నియామక పరీక్షలను విజయ వంతం చేయాలని ఇంచార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి రామ్మోహన్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాలులో.. ఏపీపీఎస్సీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ గ్రేడ్-3 పరీక్షల నిర్వహణపై.. లైజన్ ఆఫీసర్స్, అసిస్టెంట్ లైజన్ ఆఫీసర్స్, చీఫ్ సూపరిండెంట్స్ , పోలీస్, ఆర్టీసీ, మెడికల్ డిపార్ట్మెంట్ల అధికారులతో డిఆర్వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్వో రామ మోహన్ మాట్లాడు తూ ఈనెల 24 జరగనున్న ఏపీపీఎస్సీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ గ్రేడ్-3 పరీక్షలను ముందస్తు ప్రణాళికతో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పకడ్బందీగా నిర్వహించా లన్నారు. ఈనెల 24వ తేదీ (ఆదివారం) ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ నిర్వహించే ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 10.45 గంటలలోపే పరీక్ష కేంద్రానికి హాజరుకావాలన్నారు. అభ్యర్థులు వారి వారి హాల్ టికెట్ తో పాటు పాస్ పోర్ట్, పాన్ కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఏదైనా ఒకటి తమతో పాటు తీసుకెళ్లాలన్నారుపరీక్షా కేంద్రాల జాబితాలో.. గతంలో పొరపాటున జెఎంజె జూనియర్ కాలేజ్, మరియాపురం, వైఎస్ఆర్ కడప జిల్లా అని.. పరీక్ష కేంద్రం చిరునామాను చూపించడం జరిగిందని... దాన్ని కడప - రాజంపేట రోడ్డు, రామాంజ నేయపురం వద్ద ఉన్న జెఎంజె జూనియర్ కాలేజ్ గా.. గమనించి పరీక్ష కేంద్రానికి నిర్దేశిత సమయానికి హాజరుకావాలని డిఆర్వో తెలిపారు ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ బాబురావు, సెక్షన్ ఆఫీసర్ ఎం విజయ్ కుమార్, కడప కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్ కుమార్, తాసిల్దార్ శివరామిరెడ్డి, లైజన్ ఆఫీసర్స్, అసిస్టెంట్ లైజన్ ఆఫీసర్స్, చీఫ్ సూపరిండెంట్స్ , పోలీస్, ఆర్టీసీ, మెడికల్ డిపార్ట్మెంట్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఎమ్మెల్యే బలనాగి రెడ్డి జన్మదిన వేడుకలు

**తరలి వచ్చిన సర్పంచ్ లు,ఎంపిటిసి లు అభిమానులు**

కౌతాళం మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యే బలనాగి రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం మండల కార్యకర్తలు, నాయకులు వార్డ్ మెంబర్లు, సర్పంచ్ లు,ఎంపీటీసీ మండల నాయకుల ఆదేశాలు మేరకు అశోక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను తరలి వచ్చి రక్తదానం అందించారు. మండల నాయకులు దేశాయి కృష్ణ, ఆధ్వర్యంలో ఎంపిపి, వైస్ ఎంపీపీ డిప్యూటీ, ఆర్ ఐ,ఉన్నత పాఠశాల చైర్మన్ వడ్డే రాముడు,సర్పంచ్ పాల్,బీమా యూత్ అశోక్ వర్డ్ మెంబర్లు సర్పంచ్,ఎంపిటిసిలు తదితరులు జయప్రదం చేశారు.. జన్మదిన సందర్భంగా మండల కార్యాలయంలో శిబిరాలను ఏర్పాట్లు చేయడమైనది అని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది .అని అందరూ మానవత్వం తరలి వచ్చి రక్తదాన శిబిరాలను జయప్రదం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ అన్ని దానాలకంటే అన్నదానం గొప్పదని కానీ నేడు అన్ని దానాలకంటే ప్రాణదానం ఎంతో మిన్న అని మండల నాయకులు తెలిపారు. మన ఎమ్మెల్యే ప్రజల మనిషి అని సంక్షేమ నికి పాటుపడే వ్యక్తి అని తెలిపారు. అన్ని విధాల సహాయసహకారాలు అందించే వ్యక్తి మన ఎమ్మెల్యే అని ఆనందాన్ని వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం ఇచ్చి మానవత్వం చాటుకోవలని మండల నాయకులు దేశాయి కృష్ణ ఎంపీపీ అమరేషప్ప కోరారు.అనంతరం మండల కార్యాలయంలో కేక్ ను కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎంపీపీ అమరేషప్ప, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి పాల్ దినకర్, తిక్కయ్య, ఎంపిటిసి రాజహమాద్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ ఐ రాజశేఖర్, మరియు మండల సర్పంచ్ లు ,ఎంపిటిసి లు సచివాలయం సిబ్బంది కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు

# టీటీడీ కొత్త చరిత్ర.. 21 రోజులకే రూ.100 కోట్లు

తిరుమల తిరుపతి దేవస్థానం హుండీ ఆదాయంలో కొత్త రికార్డు సృష్టించింది.. జులై మాసంలో కోనేటిరాయుడికీ కాసుల వర్షం కురుస్తోంది.. ఈ నెలలో కేవలం 21 రోజుల్లోనే రూ.100 కోట్ల మార్కను క్రాస్ చేసింది శ్రీవారి హుండీ ఆదాయం.. జులై 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు శ్రీవారికీ హుండీ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ. 100 కోట్ల 75 లక్షల రూపాయల ఆదాయంగా వచ్చింది.. జులై మాసంలో స్వామివారికి ఇంత మొత్తంలో హుండీ ఆదాయం లభించడం ఇదే తొలిసారి.. ఇక, టీటీడీ చరిత్రలోకే అత్యధిక స్థాయిలో ఆదాయం జులై మాసంలో లభించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు అధికారులు.. ఇప్పటి వరకు గత మే మాసంలో లభించిన 130 కోట్ల రూపాయలే అత్యధిక హుండీ ఆదాయం కాగా.. ఈ నెల 31వ తేదీ వరకు మరింత ఆదాయం వస్తుంది కాబట్టి.. మొట్ట మొదటి సారి హుండీ ద్వారా ఒకే మాసంలో 140 కోట్ల రూపాయలు ఆదాయం శ్రీవారికి లభించే అవకాశం ఉ ందంటున్నారు.కరోనా మహమ్మారి విజృంభణ తర్వాత చాలా కాలం శ్రీవారికి దూరం అయ్యారు సామాన్య భక్తులు.. దాదాపు రెండేళ్ల తర్వాత తిరుమల గిరులు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.. మరోవైపు హుండీలో కాసుల వర్షం కురుస్తోంది.. గత ఐదు నెలలుగా రూ.100 కోట్ల మార్కను దాటేసి కొత్త రికార్డులు సృష్టిస్తూ వస్తుంది టీటీడీ.. మార్చి నెలలో శ్రీవారికి రూ.128 కోట్ల ఆదాయం, ఏప్రిల్ రూ.127.5 కోట్లు, మే మాసంలో రికార్డు స్థాయిలో 130.05 కోట్ల , జూన్ మాసంలో రూ.123 కోట్ల ఆదాయం రాగా.. జులై మాసంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉన్నప్పటికీ.. స్వామి వారి హుండీ ఆదాయం రికార్డులు సృష్టిస్తోంది.. ఈ నెలలోనే 4వ తేదీ టీటీడీ చరిత్రలోనే అత్యధికంగా రూ.6.18 కోట్ల ఆదాయం లభించింది.. దీంతో మరో పది రోజుల హుండీ ఆదాయం సరాసరి లెక్కించినా.. జులై మాసంలో టీటీడీ ఆదాయం కొత్త చరిత్ర లిఖిస్తుందని అంచనా వేస్తున్నారు.. ఐదు నెలల కాలంలోనే శ్రీవారి హుండీ ఆదాయం 650 కోట్ల రూపాయాలను క్రాస్ చేయగా.. ఈ ఏడాది మొత్తం ఆదయాం రూ. 15 వందల కోట్లును కూడా దాటేసే అవకాశం ఉన్నట్టు అంచనా వేస్తున్నారు అధికారులు.

# దేశం సుభిక్షంగా ఉండాలని సుబ్రమణ్య స్వామిని ప్రార్థించా

**- తమిళనాడు నుంచి తిరుమలకు నడచి వచ్చే భక్తులకు సదుపాయాలు**

**టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి**

తిరుత్తణి కరోనా నుంచి దేశం విముక్తి పొంది ప్రజలంతా సుభిక్షంగా ఉండేలా ఆశీర్వదించాలని శ్రీ సుబ్రమణ్య స్వామిని ప్రార్థించానని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. ఆడికృత్తిక సందర్బంగా శనివారం ఆయన సతీసమేతంగా తిరుత్తణి శ్రీ సుబ్రమణ్య స్వామి వారికి టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్దకు చేరుకున్న సుబ్బారెడ్డి దంపతులకు ఆలయ అధికారులు అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు.తరువాత తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలను చైర్మన్ దంపతులు ఆలయ అర్చకులకు అందజేశారు ఈ వస్త్రాలను శ్రీ వల్లీ దేవసేన సుబ్రమణ్య స్వామి ఉత్సవ మూర్తులకు అలంకరించారు. అలయ అర్చకులు అధికారులు చైర్మన్ దంపతులకు తీర్థ ప్రసాదాలు స్వామివారి వస్త్రాలు అందజేశారు. ఈ సందర్బంగా చైర్మన్ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు ఆడికృత్తిక సందర్బంగా టీటీడీ తరపున శ్రీ వల్లీ దేవసేన సుబ్రమణ్య స్వామి కి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.



తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు నడచివస్తారని చెప్పారు వీరి కోసం టీటీడీ పలు ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ తిరుమల ఆలయ పారు పత్తేదారు ఉమామహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# పార్లమెంట్ భవన్ ఆవరణలో ఎంపీలు ఎలాంటి నిరసన చర్యలు నిర్వహించరాదని పేర్కొంటూ ప్రభుత్వం ...

కడప కడప నగరంలో సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కామనురు శ్రీనువాసులురెడ్డి సిఐటియు జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు పార్లమెంట్ భవన్ ఆవరణలో ఎంపీలు ఎలాంటి నిరసన చర్యలు నిర్వహించరాదని పేర్కొంటూ ప్రభుత్వం జారీచేసిన నిరంకుశ ఆదేశాలు అప్రజాస్వామికం. వాక్ స్వాతంత్ర్యం ,వ్యక్తిగత స్వేచ్ఛ హరించడమే , దేశానికి, ప్రజలకు సంబంధించిన అన్ని కీలకమైన అంశాలపై తమ అభిప్రాయాన్ని చెప్పడానికి ఎంపీలు సాధారణంగా నిరసన కార్యాచరణ చేపడుతూ ఉంటారు. భారత పార్లమెంట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇది వారి ప్రజాస్వామ్య హక్కుగా వుందిపార్లమెంట్లో ఉపయోగించకూడని పదాల జాబితాను పెంచుకుంటూ కొత్తగా ఆదేశాలు జారీ చేయడంతో పాటు, నిరసనలను నిషేధిస్తూ తీసుకొచ్చిన ఉత్తర్వులు పార్లమెంట్పై జరిగిన అత్యంత దారుణమైన నిరంకుశ దాడి. అంతేకాదు, పార్లమెంట్ స్వతంత్ర పనితీరుపైన, పార్లమెంట్ సభ్యుల నుంచి విడదీయలేని

**జారీచేసిన నిరంకుశ ఆదేశాలు అప్రజాస్వామికం.**

**కామనురు. శ్రీనువాసులురెడ్డి...**

హక్కుల పైన జరిగిన దాడిగా చూడాలి.ప్రభుత్వం 'అసమర్థంగా' వ్యవహరిస్తోందని చాలా తరచుగా వ్యాఖ్యానిస్తూ వుంటారు. ఇప్పుడు ఆ అసమర్థత అనే పదం కూడా ఉపయోగించకూడని పదమై పోయింది. పార్లమెంట్లో ప్రాతినిధ్యం వహించే రాజకీయ పార్టీలను సంప్రదించకుండా, ఏకపక్షంగా తీసుకున్న

ఈ నిర్ణయం పూర్తిగా అప్రజాస్వామికం. పైగా పార్లమెంట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా ఈ చర్య తీసుకోవడం మరీ దారుణం.ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలి.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహబుతార ,రాజేష్, సుబ్బారాయుడు తదితరులు పాల్గొననున్నారు.

# ఆగస్టు 2నుంచి 22 వరకు సంఘర్షణ యాత్ర

కడప వైసిపి ప్రభుత్వ విధానాలపై ఆగస్టు 2నుంచి 22వరకు సంఘర్షణ యాత్ర పేరుతో ప్రజల్లోకి వెలుతున్నట్లు బిజెవైయం రాష్ట్ర అధ్యక్షుడు నాబోతు రమేష్ నాయుడు తెలిపారు శనివారం కడప నగరంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత ఎన్నికల ముందు తన పాదయాత్రలో ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు ఈ సమావేశంలో ఆపార్టి నాయకులు ఆది నారాయణ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, బాలక్రిష్ణ యాదవ్,చలపతి తదితరులు పాల్గొన్నారు

## సూగూరులో వైస్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి జన్మదిన వేడుకలు

మంత్రాలయం : మంత్రాలయం మండలం పరిధిలోని సూగూరు గ్రామంలో ఉప సర్పంచ్ గోపీనాథ్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి నాయకులు దేవదాసు వాల్మీకి నాయకులు లక్ష్మిరెడ్డి కురుమూర్తి మహబూబ్బాషా తదితరులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సూగురులో ఉపసర్పంచ్ గోపీనాథ్ సగృహంలో బాల నాగిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గోపీనాథ్ మాట్లాడుతూ రాంపురం రెడ్డి



సోదరులలో ఒకరైన హ్యాట్రిక్ ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి గారు ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో మరెన్నో జరుపుకోవాలని ఆశిస్తూ రాజకీయ రంగంలో భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వ ం న స ా ్ర ి ా గా కోరుకుంటుమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపీనాథ్ వైయస్సార్ సిపి నాయకులు దేవదాస్ లక్ష్మిరెడ్డి గురుమూర్తి పాత్రికేయులు మహబూబ్బాషా వైఎస్ఆర్సిపి యూత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి నీటి పన్ను బకాయిలు 8 కోట్ల రూపాయలు

నంద్యాల:- నంద్యాల మున్సిపాల్టీ కి ప్రజల నుంచి 8 కోట్ల రూపాయలు రావలసి ఉన్నదని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి తెలిపారు. శనివారం సచివాలయ సెక్రటరీ వారితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మీ సచివాలయ పరిధిలో గల పెండింగ్ లో ఉన్న టాప్ కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. . లేని యెడల మీ పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్యశ్రీ సేవల గురించి అవగాహన కార్యక్రమం



తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు జిల్లా ట్రైనింగ్ అధికారులు ఆరోగ్య శ్రీ సేవల గురించి అవగాహనను కల్పించారు. శనివారం రోజున ప్రాథమిక వైద్యశాల యందు కర్నూలు జిల్లా నుండి ఆరోగ్యశ్రీ టీం లీడర్ శ్రీధర్ ఆరోగ్య శ్రీ సేవల గురించి తుగ్గలి ప్రాథమిక వైద్యశాలకు సంబంధించిన వైద్యశాఖ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద 2446 కేసులకు గవర్నమెంట్ మరియు కార్పొరేట్ హాస్పిటల్స్ నందు చికిత్స అందుతుందని, ఆరోగ్యశ్రీ పథకం వర్తించాలంటే రోగికి తప్పకుండా ఆరోగ్యశ్రీ కార్డు ఉండాలని ఆయన తెలియజేశారు. అదేవిధంగా 1519 వ్యాధులకు ఆరోగ్య ఆసరా పథకం వర్తిస్తుందని ఆయన తెలియజేశారు. ఆరోగ్య ఆసరా పథకం ముఖ్య ఉద్దేశం ఒక రోగి వ్యాధి చికిత్స చేయించుకున్న అనంతరం ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఆ రోగికు రోజుకు 225 రూ చొప్పున,అనగా ఒక నెలకు 5000 రూపాయల చొప్పున ప్రభుత్వం రోగికు అందజేస్తుందని ఆయన తెలియజేశారు. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే మెడికల్ ఆఫీసర్ ను సంప్రదించి చికిత్సకు సరైన మార్గాన్ని ఎంచుకోవాలని ఆయన సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్వైజర్లు, సచివాలయ ఏఎన్ఎం లు,ఎం.ఎల్.హెచ్.పి లు మరియు ఆరోగ్య మిత్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే బలనాగి రెడ్డి జన్మదిన వేడుకలు

### రక్తదాన శిబిరాలను తరలి వచ్చిన సర్పంచ్ లు,ఎంపిటిసి లు అభిమానులు



కౌతాళం మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యే బలనాగి రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం మండల కార్యకర్తలు, నాయకులు వార్డ్ మెంబర్లు, సర్పంచ్ లు,ఎంపీటీసీ మండల నాయకుల ఆదేశాలు మేరకు అశోక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను తరలి వచ్చి రక్తదానం అందించారు. మండల నాయకులు దేశాయి కృష్ణ, ఆధ్వర్యంలో ఎంపిపి, వైస్ ఎంపీపీ డిప్యూటీ, ఆర్ ఐ,ఉన్నత పాఠశాల చైర్మన్ వడ్డే రాముడు,సర్పంచ్ పాల్,బీమా యూత్ అశోక్ వర్డ్ మెంబర్లు సర్పంచ్,ఎంపిటిసిలు తదితరులు జయప్రదం చేశారు.. జన్మదిన సందర్భంగా మండల కార్యాలయంలో శిబిరాలను ఏర్పాట్లు చేయడమైనది అని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది .అని అందరూ మానవత్వం తరలి వచ్చి రక్తదాన శిబిరాలను జయప్రదం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ అన్ని దానాలకంటే అన్నదానం గొప్పదని కానీ నేడు అన్ని దానాలకంటే ప్రాణదానం ఎంతో మిన్న అని మండల నాయకులు తెలిపారు. మన ఎమ్మెల్యే ప్రజల మనిషి అని సంక్షేమ నికి పాటుపడే వ్యక్తి అని తెలిపారు. అన్ని విధాల సహాయసహకారాలు అందించే వ్యక్తి మన ఎమ్మెల్యే అని ఆనందాన్ని వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం ఇచ్చి మానవత్వం చాటుకోవలని మండల నాయకులు దేశాయి కృష్ణ ఎంపీపీ అమరేషప్ప కోరారు

## శ్రీమఠంలో ముంబై హైకోర్టు న్యాయమూర్తి

మంత్రాలయం : రాఘవేంద్ర స్వామి బృందావనం దర్శనార్థం ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఆర్ శ్రీరామ్ కుటుంబ సమేతంగా శనివారం మంత్రాలకు వచ్చారు. వీరికి శ్రీ మఠం మేనేజర్ ఎస్ కే .శ్రీనివాసరావు అసిస్టెంట్ మేనేజర్ నరసింహమూర్తి వేద పండితులు శ్రీమఠం సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనంను దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి కే.ఆర్. శ్రీరామ్ ఆయన సతీమణి ఉషా శ్రీరామ్ దంపతులకు మేనేజర్ శాలువా మెమెంటో ఫలమంత్ర అక్షింతలు అందజేశారు .అనంతరం శ్రీమఠంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించి చెప్పారు. ఆరాధన ఉత్సవాల కల్లా చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తవుతాయని ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు.





## కడప జిల్లా వార్తలుమందులు పిచ్చిగారిపై రైతులకు అవగాహన సదస్సు

బద్వేలు, రైతులు తమ పంట పొలాలకు పురుగుమందు లు పిచికారి చేసేటప్పుడు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి కే చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. శనివారంబద్వేల్ మండలం లోని అనంతరాజుపు రం రైతు భరోసా కేంద్రంలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయా అధికారి కె చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమం నందు పురుగుమందులు పిచికారీ చేసే సమయం లో తీసుకువలసిన జాగ్రత్తలు, పంటల పై రైతులకు వున్నా ఆగాహన గురించి వివరించడం జరిగినది, ఈ కార్యక్రమం లో గ్రామ రైతులు మరియు వ్యవసాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది



## మహేష్ పాన్ ఇండియా హిస్టారికల్ ఫిక్షన్!



సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా దర్శక దిగ్గజం రాజమౌళి దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కి రంగం సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మిడ్ లో సినిమా ప్రారంభం కానుంది. ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో సాగే స్టోరీ అని ఇప్పటికే రివీల్ చేసారు. ప్రస్తుతం రాజమౌళి-స్టార్ రైటర్ విజయేంద్ర ప్రసాద్ స్క్రిప్ట్ సిద్ధం చేసే పనిలో పడ్డారు.'బాహుబలి'..'ఆర్ ఆర్ ఆర్' రికార్డులన్నింటిని కొల్లగొట్టే స్క్రిప్ట్ తో రాబోతున్నట్లు ఇప్పటికే అర్థమైంది. అదీ మహేష్ తో తొలిసారి చేస్తోన్న చిత్రం కావడంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తున్నారు. పాన్ ఇండియాని దాటి పాన్ వరల్డ్ రీచ్ అయ్యేలా..అసలు సిసలైన గ్లోబల్ సినిమాగా ఆవిష్కరించే దిశగా స్క్రిప్ట్ ని డిజైన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా కూడా హిస్టారికల్ ఫిక్షన్ స్టోరీ అని తెలుస్తోంది.'బాహుబలి'..'ఆర్ ఆర్ ఆర్' తరహాలోనే పూర్తిగా ఫిక్షన్ కథే అని లీకులందుతున్నాయి. ఆ రెండు సినిమాల రచన కొన్ని నవలలు..చరిత్రను ఆధారం చేసుకుని రాసిన పుస్తకాలు ఆధారంగా తయారు చేసిన కథ. అందులో ప్రఖ్యాత రచయిత కల్కి కృష్ణమూర్తి నవలలు నుంచి స్ఫూర్తి పొందని సందర్భం ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.ఎన్నో సినిమాల నుంచి ప్రేరణ పొందినట్లు చెప్పుకొస్తున్నారు. విజయేంద్ర ప్రసాద్ కథలన్నీ ఒకే జోనర్ కి చెంది ఫిక్షన్ కథలే ఉంటాయని అంటున్నారు. దాన్ని ఆధారంగా చేసుకునే కథలో రకరకాల లేయర్లు సిద్ధం అవుతాయని..వాటిని బేస్ తోనే విజువల్ గా సీన్ ఎలా హైలైట్ చేయాలన్న దానికి కొన్ని హాలీవుడ్ సినిమాల నుంచి స్ఫూర్తిని పొందుతారని అంటున్నారు.ప్రస్తుతం మహేష్ కోసం సిద్ధం చేస్తున్న కథ కూడా అలాంటిదే అంటున్నారు. ఎన్నో నవలల సమూహారమే ఆఫ్రికన్ బ్యాక్ డ్రాప్ స్టోరీ అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. విజయేంద్ర ప్రసాద్ ఎలాంటి కథ రాసినా వాటిపై కల్కి కృష్ణమూర్తి ప్రభావం కచ్చితంగా ఉంటుందని గంటా పథంగా చెబుతున్నారు. మణిరత్నం తెరకెక్కిస్తోన్న 'పొన్నియన్ సెల్వన్' 'బాహుబలి' ని పోలి ఉంటుందని... ఈ సినిమాకి కాపీ కొట్టి తీస్తున్నారని వస్తోన్న విమర్శల వెనుక కల్కి రచనల ప్రభావం అయి ఉంటుందని ఈ రకంగా గెస్ చేయొచ్చు.


## నిధి ఎక్కడ?.. నభా ఏమైపోయింది?

టాలీవుడ్ తెరకి నిధి అగర్వాల్ .. నభా నటేశ్ ఒకే సమయంలో పరిచయమయ్యారు. నిధి చక్కని కనుముక్కుతీరుతో ఆకట్టుకుంది. 'సవ్యసాచి'లో నిధిని చూసినవాళ్లంతా ఈ మధ్య కాలంలో ఇలాంటి పిల్ల ఇండస్ట్రీకి రాలేదని అనుకున్నారు. దొండపండులాంటి ఈ పిల్లకి ఢోకా లేదని చెప్పుకున్నారు. ఆ తరువాత



చేసిన 'మిస్టర్ మజ్ను' సినిమా కూడా సరిగ్గా ఆడలేదు. అయినా ఏకంగా పూరి సినిమాలోనే ఛాన్స్ కొట్టేసింది. ఇక మరో వైపున 'నన్ను దోచుకుందువటే' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన నభా కూడా అటు ఇటు తిరిగి 'ఇస్మార్ట్ శంకర్' ప్రాజెక్టులోకి వచ్చింది.నిధి చూస్తేనేమో సన్నజాజి కి కాస్త ఇటుగా .. సంపెంగకి కాస్త అటుగా అనిపిస్తుంది. ఇక నభా విషయానికి వస్తే చామంతికి .. ముద్దబంతికి అటు ఇటుగా కనిపిస్తుంది. ఇద్దరూ ఈ సినిమాలో అందాలు ఆరబోయడానికి వెనుకాడలేదు .. మొహమాటపడలేదు. ఈ సినిమాలోని మాస్ సాంగ్స్ లో ఈ ఇద్దరూ కలిసి చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ హిట్ ను నమోదు చేయడంతో ఇక ఈ భామలను పట్టుకోవడం కష్టమే అనుకున్నారు. అవకాశాలన్నీ ఈ అందాల భామల చుట్టూనే ప్రదక్షిణం చేస్తాయని భావించారు.అయితే ఈ ఇద్దరి భామల్లో నిధి అంత స్పీడ్ చూపించలేదు. కోలీవుడ్ వైపు చూస్తూనే తెలుగులో 'హీరో' అనే ఒక సినిమా చేసింది. ఒక వైపున పవన్ కల్యాణ్ తో చేస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమా సెట్స్ పై ఉండగానే ఆమె ఒక కొత్త హీరోతో సినిమా చేయడం ఆమెకే చెల్లింది. ఆ సినిమా ఆమె కెరియర్ కి ఏమైనా హెల్ప్ అయిందా అంటే అదీ లేదు. పోనీ ఈ సినిమా తరువాతైనా మిగతా ప్రాజెక్టులు ఏమైనా లైన్లో పెట్టిందా అంటే అదీ లేదు. ఇంత అందం పెట్టుకుని ఇంటి పట్టున కూర్చోవడం కూడా ఆమెకే చెల్లింది.ఇక నభా విషయానికి వస్తే .. అవకాశాలను ఎంత ఫాస్టుగా అందుకోవచ్చునో చూపించింది. 'డిస్కోరాజా' .. 'సోలో బ్రతుకే సో బెటర్' .. 'అల్లుడు అదుర్స్' .. 'మాస్ట్రో' సినిమాలను చకచకా చేసేస్తూ వెళ్లింది. అయితే ఈ సినిమాలన్నీ ఒక దాని తరువాత ఒకటిగా వచ్చాయి.. పోయాయి.సక్సెస్ లు మాత్రం ఎక్కడో ఏదో తట్టుకుని ఆగిపోయాయి. ఆ తరువాత నుంచి నభాకి కూడా అవకాశాలు లేవు. నిదానమే ప్రధానమన్నట్టుగా ఉన్న నిధి పరిస్థితి .. ఆలస్యం అమృతం విషం అన్నట్టుగా దూకుడుగా వెళ్లిన నభా పరిస్థితి ఒకేలా ఉంది. అందుకే అంటారు.. కొత్త కథానాయికలు వచ్చేలోగా కొంతైనా వెనకేసుకోవాలని!

## నివేదా థామస్ గ్యాప్ తీసుకుందా? లేక వచ్చిందా?



నివేదా థామస్.. ఈ డింపుల్ సుందరి గురించి ప్రత్యేకమైన పరిచయాలు అవసరం లేదు. కేరళలో పుట్టిన ఈ అందాల భామ.. మలయాళ చిత్రంతో బాలనటిగా తన కెరీర్ని స్టార్ట్ చేసి ఆ తర్వాత హీరోయిన్ గా మారింది. న్యాచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కిన 'జెంటిల్ మేన్' మూవీతో టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. తొలి సినిమాతోనే తన అందం అభినయం అంతకు మించిన టాలెంట్ తో ప్రేక్షకులను కట్టిపడేసిన నివేదా థామస్.. ఆపై తెలుగులో వరుస అవకాశాలను అందిపుచ్చుకుంది. ఈ క్రమంలోనే నిన్ను కోరి జై లవకుశ 118 బ్రోచేవారెవరురా వంటి హిట్ చిత్రాలను ఖాతాలో వేసుకుంది. మరోవైపు తమిళ మలయాళ భాషల్లోనూ నటించిన నివేదా.. గత కొంత కాలం నుండి చాలా సైలెంట్ గా ఉంటోంది. సోషల్ మీడియాలో తప్పా సినిమాల్లో కనిపించడం లేదు. ఈమె నుండి చివరిగా వచ్చిన చిత్రం 'వకీల్ సాబ్'. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో వచ్చిన కోర్ట్ డ్రామా మూవీ ఇది. బాలీవుడ్ లో అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'పింక్' సినిమాకు రీమేక్ గా వకీల్ సాబ్ ను రూపొందించారు. ఇందులో నివేదా థామస్ తో పాటు అంజలి అనన్య నాగళ్ల కీలక పాత్రలను పోషించారు. 2021లో విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్ గా నిలిచింది. అలాగే ఇందులో వేముల పల్లవిగా నటించిన నివేదా థామస్ కు విమర్శకుల ప్రశంసలు దక్కాయి.అయితే వకీల్ సాబ్ తర్వాత నివేదా నుండి మరో సినిమా రాకపోవడం గమనార్హం. అసలు సినిమాల నుండి నివేదా థామస్ కావాలనే గ్యాప్ తీసుకుందా..?లేక అవకాశాలు రాకపోవడం వల్ల గ్యాప్ వచ్చిందా..? అన్న దానిపై మాత్రం స్పష్టత లేదు. ఇక ప్రస్తుతం ఈమె చేతిలో 'శాకిని డాకిని' అనే ఒకే ఒక్క చిత్రం ఉంది.టాలీవుడ్ డైరెక్టర్ సుధీర్ వర్మ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో నివేదా థామస్ రెజీనా కాసాండ్రా ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. కొరియన్ మూవీ మిడ్ నైట్ రన్నర్స్ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం సురేష్ ప్రొడక్షన్స్ గురు ఫిలింస్ క్రాస్ పిక్చర్స్ బ్యానర్లపై నిర్మితం అవుతోంది. కిడ్నాప్ డ్రామా బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీ సాగనుంది.అయితే ఈ మూవీ నుండి మేకర్స్ ఎప్పుడో గత ఏడాది ఒక పోస్టర్ ను బయటకు వదిలారు. ఆ తర్వాత 'శాకిని డాకిని'కి సంబంధించి ఎలాంటి అప్డేట్స్ రాలేదు. అసలు ఈ సినిమా ఉందో..లేదో.. కూడా అర్థం కావడం లేదు. గతంలో ఈ సినిమాను డైరెక్ట్ ఓటీటీలో విడుదల చేయనున్నామని నిర్మాతలో ఒకరైన సురేశ్ బాబు వెల్లడించారు. కానీ అందుకు సంబంధించిన ప్రకటన కూడా ఇప్పటి వరకు రాలేదు.

## రాహుల్ రికార్డును బ్రేక్ చేసిన అయ్యర్



వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో 54 పరుగులు చేసి కెరీర్‌లో 10వ అర్ధశతకాన్ని నమోదు చేసిన అయ్యర్.. వన్డేల్లో వేగంగా 1000 పరుగులు పూర్తి చేసిన రెండో భారత ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఈ క్రమంలో అతను స్టార్ ఓపెనర్ కేఎల్ రాహుల్ రికార్డును బ్రేక్ చేసి భారత మాజీ ఓపెనర్ నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూతో సమంగా నిలిచాడు. శ్రేయస్, సిద్ధూలు 25 ఇన్నింగ్స్‌ల్లో 1000 పరుగుల మార్కును చేరుకోగా.. రాహుల్‌కు ఈ మైలురాయిని చేరుకునేందుకు 27 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి. ఈ జాబితాలో విరాట్ కోహ్లి, శిఖర్ ధవన్‌లు సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. వీరిద్దరూ 24 ఇన్నింగ్స్‌లో 1000 పరుగుల మార్కును చేరుకున్నారు. ఇదిలా ఉంటే, విండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా 3 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఈ సమరంలో టీమిండియాదే పైచేయిగా నిలిచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 308 పరుగులు చేయగా.. ఛేదనలో విండీస్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 305 పరుగులు చేయగలిగింది. భారత ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శిఖర్ ధవన్ (97) మూడు పరుగుల తేడాతో శతకం చేజార్చుకోగా, శుభ్‌మన్ గిల్ (64), శ్రేయస్ (54) అర్ధసెంచరీలతో రాణించారు. విండీస్ బ్యాటర్లలో కైల్ మేయర్స్ (75), బ్రాండన్ కింగ్ (54) హాఫ్ సెంచరీలు నమోదు చేయగా ఆఖర్లో అకీల్ హుసేన్ (32 నాటౌట్), రొమారియో షెపర్డ్ (39 నాటౌట్) విండీస్‌ను గెలిపించేందుకు విఫలయత్నం చేశారు.

### టీమిండియా డ్రెస్సింగ్ రూంలో క్రికెట్ దిగ్గజం.. ఏం చేశాడో చూడండి..!

విండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా 3 పరుగుల స్వల్ప తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, మ్యాచ్ అనంతరం గెలుపు సంబురాల్లో ఉన్న టీమిండియా సభ్యులను పలకరించేందుకు ఓ అనుకోని అతిథి భారత డ్రెస్సింగ్ రూమ్‌లో ప్రత్యక్షమయ్యాడు. మ్యాచ్‌కు వేదిక అయిన ట్రినిడాడ్ బ్యాటింగ్ దిగ్గజం బ్రియాన్ లారాకు స్వస్థలం కావడంతో అతను మ్యాచ్‌ను వీక్షించేందుకు మైదానానికి వచ్చాడు. ఈక్రమంలో స్టాండ్స్‌లో టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌ను కలిసిన లారా.. అనంతరం భారత జట్టు సభ్యులను విష్ చేసేందుకు డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో లారా కనిపించడంతో టీమిండియా సభ్యులు చహల్, కెప్టెన్ ధవన్, శ్రేయస్ అయ్యర్‌లు అతనితో మాట కలిపేందుకు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఈ ముగ్గురితో కాసేపు ముచ్చట్లు పెట్టిన లారా అనంతరం అక్కడి నుంచి బయల్దేరాడు. దీనికి సంబంధించిన వీడియోను బీసీసీఐ ట్విటర్‌లో పోస్ట్ చేయగా ప్రస్తుతం వైరలవుతోంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**